క్లుప్తంగా

బంగారు గొలుసు చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి వెనుకవైపు తలుపు తీసి బీరువాలో 9 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసు, వెండి పట్టీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని సోమవారం నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన బుదాల సంతోష్‌కుమార్ కారు డ్రైవరుగా పని చేస్తాడు. ఈ నెల 27వ తేదీన ఉదయం మెయిన్‌డోర్‌కు తాళం వేసి చర్చికి వెళ్లి వచ్చారు. తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటి వెనుక వైపు తలుపు తీసి ఉంది. బీరువాలో 9 గ్రాముల నల్లపూసల గొలుసు, జత వెండి పట్టీలు, రూ.1200 చోరీ జరిగినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. ప్రధాన డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవటంతో మురుగు ప్రవాహం నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో స్థానికులు విజ్ఞప్తి మేరకు పారిశుద్ధ్య సిబ్బంది సిల్టు తొలగింపు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగుకాలువలలో చెత్తచెదారం వేయరాదని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

శాంతకుమారికి సత్కారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకురాలు కోలా శాంత కుమారి ఎంపికయ్యారు. శాంతకుమారి ఎంపికను హర్షిస్తూ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాలు ఆమెకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. నాయకులు నందెపు సురేష్, ఎండీ హఫీజుల్లా, ఆదిరాల విజయకుమార్, షేక్ వెంకట్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మద్యానికి బానిస అయ్యిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ప్రాంతానికి చెందిన యనమదల నరేష్ (40) నవరంగ్ థియేటర్ సమీపంలో మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై నిత్యం భార్య దీపికతో గొడవ పడేవాడు. దీంతో కొద్దిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అయినప్పటికీ నరేష్ మద్యం తాగి భార్య వద్దకు వెళ్లి గొడవ పడుతున్నాడు. మద్యం తాగి సరిగా భోజనం చేయకపోవటంతో నరేష్ ఆరోగ్యం పాడయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఏలూరు రోడ్డులోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలో నరేష్ మృతి చెంది ఉన్నాడంటూ పోలీసులకు సమాచారం అందింది. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు విచారించి నరేష్ భార్యకు సమాచారం ఇవ్వటంతో ఆమె వచ్చి చనిపోయిన వ్యక్తి తన భర్త నరేష్ అని నిర్ధారించింది. భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి సస్పెన్షన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించటం, అధికారులను తప్పుదోవ పట్టించిన కారణంగా గవర్నర్‌పేట వార్డు సచివాలయం ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి దాసు స్వాతిని సోమవారం ప్రభుత్వం సస్పెండ్ చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వానికి చెల్లించాల్సిన నిధులను సకాలంలో జమ చేయకుండా ఉద్దేశ పూర్వకంగా తన దగ్గరే ఉంచుకొని, సాంకేతిక కారణాలు అంటూ సాకులు చెప్పినందుకు ఆమెపై సస్పెన్షన్ వేటు వేసింది. డాష్‌బోర్డులో గవర్నర్‌పేట సచివాలయం వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి కింద రూ. 3,04,967 పెండింగ్‌లో ఉన్నట్లు చూపించడంతో అధికారులు ఆరా తీసారు. దీనికి స్వాతి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తాను జూలై నెల 25వ తేదీన చలనాలు ద్వారా డబ్బు చెల్లించినట్లు తెలిపారు. అయితే ఆ చలనాలు ఈ నెల 16, 17వ తేదీన ప్రధాన కార్యాలయం ఖాతాలో జమ అయ్యినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో తన తప్పులేదని అని బ్యాంకులో చలానా అప్‌డేట్‌లో పొరపాటు జరిగిందంటూ అధికారులను తప్పుదోవ పట్టించింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు ప్రతి నెలా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ నిబంధనల ప్రకారం సకాలంలో డబ్బులు చెల్లించకుండా రెండు నుంచి మూడు లక్షలు రూపాయలు తన వద్ద ఉంచుకున్నట్లు నిర్ధారించారు. దీనితో కార్యదర్శిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీసా ఆదేశాలు జారీచేశారు.

గ్రామ కార్యదర్శులకు శిక్షణ

విజయవాడరూరల్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 41 మండలాల్లో పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తానని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.జ్యోతి బసు ఆదేశాలు జారీ చేశారు. గ్రేడు 1, గ్రేడు 5 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలకు నిర్వహించడానికి అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు సీఈవో ఆదేశాలు జారీ చేశారు.

గడప గడపకు తలుపుతట్టి సంక్షేమం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ, జానారెడ్డి



రేషన కార్డు మంజూరైన లబ్ధిదారులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ, బి.జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గడప గడపకు తలుపుతట్టి సంక్షేమం అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30 వ డివిజన్ 242 వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. రామకృష్ణాపురంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హులకు కూడా తలుపుతట్టి మరీ ఈ ప్రభుత్వం మంచి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు ఒక పెద్ద కాపీ మాస్టర్....

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని కాపీ చేయడమే చంద్రబాబు పని అని విమర్శించారు. టీడీపీ చెబుతున్న కుటుంబ సాధికార సారథులు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గృహ సారథులకు పూర్తిగా కాపీ వెర్షన్ కాదా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు సీఎం జగన్ ప్రభుత్వ పథకాలనే కాపీ కొట్టిన ప్రతిపక్ష నేత.. చివరకు పార్టీ కార్యక్రమాలనూ కాపీ కొట్టే స్థాయికి దిగజారడం సిగ్గుచేటన్నారు. పైగా సీఎం జగన్ పాలనపై ప్రజలు విసిగిపోయారని బాబు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 30 డివిజన్ రామకృష్ణాపురంలో సోమవారం జరిగిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బి.హెచ్‌ఎస్‌వీ జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సీఎం మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డు దరఖాస్తులను పరిశీలించి నూతన కార్డులను మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో రేషన్ కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, కానీ ఈ ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రతి 6 నెలలకోసారి కొత్త కార్డులను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సెంట్రల్ నియోజకవర్గంలో 1,142 మంది అర్హులను గుర్తించి నూతన కార్డులు మంజూరు చేశామని వివరించారు కొత్త రేషన్ కార్డు దారులకు వచ్చే నెల నుంచి రేషన్ అందిస్తామన్నారు. కార్డులను సద్వినియోగపరచుకుని పిల్లల చదువులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నూతన కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ-2 ధనుంజయరెడ్డి, ఆర్‌ఐలు భగీరథ, వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓలు, లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా..?

చంద్రబాబు పాలనలో విద్యుత్ రంగం పూర్తిగా కుదేలైందని తెలిపారు. టీడీపీ హయాంలో సుమారు రూ. 25 వేల కోట్ల బకాయిలు పెట్టి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు. ధైర్యముంటే నారా లోకేష్, పచ్చ నేతలు విద్యుత్ రంగంపై బహిరంగం చర్చకు రావాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు చేసిన తప్పులకు రాష్ట్రం అంధకార ప్రదేశ్ గా మారకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న విద్యుత్ బకాయిలు కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు మార్తి చంద్రమౌళి, పవన్ కుమార్ రెడ్డి, వి.రమేష్, డి.కృష్ణ, భోగాది మురళి, డి. దుర్గారావు, రఫీ, వర్మ, రాజు, ముత్యాలు, గోపిశెట్టి శ్రీను, బెజ్జం రవి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి పటిష్ట చర్యలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహిళల స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 58వ డివిజన్ అజిత్‌సింగ్ నగర్‌లో మెప్మా, వీఎంసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో సాధ్యమైనంత ఎక్కువ మందికి ఉపాధి చూపాలన్న లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ వంటి కార్యక్రమాలతో మహిళల స్థిరమైన జీవనోపాధికి ప్రభుత్వం బాటలు పరిచినట్లు వెల్లడించారు. అలాగే పట్టణ ప్రజలకు సరసమైన ధరలకు రుచికరమైన, శుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఆహా క్యాంటీన్ల ఏర్పాటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిల్స్ నందు మూడు క్యాంటీన్లను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. నగర ప్రజలందరూ ఈ ఆహా క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ మహాలక్ష్మి, నాయకులు అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావు, కృష్ణ, శోభన్, నేరెళ్ల శివ, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



ఆహా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో విష్ణు

భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న వివాదంతో, భర్తపై భార్య వేడి నీళ్లు పోసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కేటీ రోడ్డులోని చిట్టిగారి పార్కు ప్రాంతంలో ఎం. దుర్గారావు, శ్రావణి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా, దుర్గారావు అల్యూమినియం కంపెనీలో పని చేస్తుండగా, శ్రావణి బందరురోడ్డులోని ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తుంది. ఆదివారం భార్యాభర్తలిద్దరికి చిన్న పాటి గొడవ జరిగింది. అది మనస్సులో పెట్టుకుని రాత్రి ఇంట్లో మంచంపై ఉన్న దుర్గారావుపై శ్రావణి వేడి వేడి నీళ్లు పోసింది. దీంతో దుర్గారావు రెండు చేతులు, ఛాతీ, వీపుపై తీవ్రగాయాలు కాగా, బాధితుడు ఇంటి సమీపంలోని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నారు. సోమవారం గాయాల తీవ్రత అధికం కావడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేత్రదానం అవగాహనపై ప్రదర్శన

పటమట(విజయవాడతూర్పు): నేత్రదానం ప్రతి ఒక్కరి బాధ్యతని, దేశంలో నల్లగుడ్డు అంధత్వం ఉన్నవారికి చూపుని ప్రసాదించి వారికి నూతన జీవితాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్లనారాయణరావు పేర్కొన్నారు. స్వేచ్ఛ గోరా ఐబ్యాంక్ ఆధ్వర్యంలో నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు సందర్భంగా నాస్తిక కేంద్రంలో సోమవారం అవగాహన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సమాజంలో వివిధ రకాల మూఢన్మకాలు, అపోహలు, నిర్లిప్తత కారణంగా నేత్రదానం చేసేవారి సంఖ్య తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే నల్లగుడ్డు అంధత్వాన్ని సులువుగా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వేచ్ఛ గోరా ఐబ్యాంక్‌కు తన కళ్లను దానం చేస్తున్నట్లు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని అందించారు. ఈ అవగాహన ప్రదర్శన సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగుతుందని ఐ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ సమరం తెలిపారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, డాక్టర్ మారు, అడ్వకేట్ హేరం కుమార్, ఐబ్యాంక్ మేనేజర్ డి. రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న గోళ్ల నారాయణరావు, డాక్టర్ సమరం

నేటి నుంచి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకూ 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, సజావుగా శాంతిభద్రతలు కాపాడటానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న సమయంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టూటౌన్, సత్యనారాయణపురం, ఏఎస్‌నగర్, నున్న, గవర్నర్ పేట, సూర్యారావు పేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో నలుగురు లేదా అంతకుమించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడరాదని, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఎవరెవరు?' పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్: మిరియాల వెంకట్రావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మురళి రచించిన ఆంధ్రప్రదేశ్ లోక్ సభ, శాసన సభ ఎవరెవరు? పుస్తక ఆవిష్కరణ సభ విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ పార్లమెంట్ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎవరు దేనికి అర్హులో అదే వారికి లభిస్తుందన్నారు. ఈ పుస్తకం చదివిన వారికి నియోజకవర్గాల వారీగా కుల ప్రయోనాలు తెలుస్తాయని చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన ఎలా ఉండాలో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ శాసన సభలో మాట్లాడటం ఈనాటి శాసన సభ్యులు తెలియడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జాగర్లమూడి రామకృష్ణ, ఎమ్‌వీఆర్ ఫౌండేషన్ కటారి అప్పారావు, ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ అరవ రామకృష్ణ, ఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చందు జనార్దన్ తదితరుల పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న ఉండవల్లి అరుణ్‌కుమార్

వైఎస్సార్ బీమా నగదు అందజేత

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సోమవారం వైఎస్సార్ బీమా నగదును 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి అందజేశారు. తాడంకివారివీధికి చెందిన కొండవీటి రమేష్ అనారోగ్యంతో ఈ నెల 25న మృతి చెందాడని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు విలియం, సూరజ్, హెల్త్ సెక్రటరీ హేమంత్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.





ఆకర్షణీయంగా పేవర్స్

విజయవాడలోని ఫైపుల్ రోడ్డు సెంటర్ నుంచి పాయకాపురం వరకు రోడ్డుకు ఇరువైపుల వేస్తున్న పేవర్స్ ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. వివిధ రంగుల్లో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

130 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సర్వేంద్రియాం నయనం ప్రధానం అని కంటి ప్రాముఖ్యతను మన పెద్దలు చెప్పారని అటువంటి నేత్రాలను కాపాడుకోవాలని డీపీఎం డాక్టర్ పి.శిరీష అన్నారు. అయోధ్యనగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ డాక్టర్ కె.రవిరాజ్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 130 మంది వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, 45 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యనగర్ యూపీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

30 నుంచి జై సంతోషిమాత జయంతి ఉత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో వేంచేసియున్న జై సంతోషిమాత అమ్మవారి 26వ జయంతి ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు నిరర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. జైసంతోషిమాత ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమ్మవారి జయంతి ఉత్సవ విశేషాలను ఆయన వివరించారు. తొలుత ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన, ప్రచార పత్రికలను కమిటీ పెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. భక్తుల సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. 30వ తేదీ శ్రావణ శుద్ధ పౌర్ణమి పర్వదినాన ఉదయం 5 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 31వ తేదీన రథోత్సవం, 1వ తేదీన పూజలు, 2వ తేదీన మహాన్నదానం చేస్తామన్నారు. భక్తులు ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి సీమంద్ర నాగేశ్వరావు, కోశాధికారి కాకాని సునీల్, కమిటీ ప్రతినిధులు చిన్ని లక్ష్మీ, ఉప్పు వెంకటేశ్వరావు ఆగురు త్రినాథ్, మార్కెండేయులు, రాజు పాల్గొన్నారు.



ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ డివిజన్ల నుంచి స్థానికులు స్పందనలో పెట్టుకున్న అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కోరారు. మొత్తం 21 సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. అందులో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం - 5, పట్టణ ప్రణాళిక విభాగం - 7, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం (పీవో యూసీడీ)-06, పబ్లిక్ హెల్త్ విభాగం- 2 ఎస్టేట్స్ విభాగంపై 01 అర్జీలు వచ్చాయి. సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, సీఈ ప్రభాకర్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, బయాలజిస్ట్ సూర్య నాయక్, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమం నిర్వహించారు. పటమటలోని సర్కిల్-3లో ఇంజినీరింగ్-2, పట్టణ ప్రణాళిక విభాగంపై-1, చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 లో సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2 కార్యాలయంలో ఎలాంటి అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమ్మోహనం వీణ వయోలిన్ వాయిద్య సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రం శ్రవణ సదనంలో సోమవారం నిర్వహించిన వీణ, వయోలిన్ వాద్య సమ్మేళనం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. యువ సంగీత కళాకారుడు చిట్టా కార్తీక్, చెన్నైకి చెందిన గాయత్రి విభావరి వాగ్గేయకారుల సంకీర్తనలు మధురంగా పలికించారు. మృదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై చంద్రకాంత్ సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాడానికి యువ కళాకారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాదోపాసన భగవత్ సేవగా భావించాలని సూచించారు. శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నిర్వాహకుడు సీవీరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ఎందరో యువ కళాకారులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. ఏటా జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అంజనా సుధాకర్, మోదుమూడి సుధాకర్ దంపతులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత రంగానికి చెందిన వేమూరి విశ్వనాథ్, సద్గురు చరణ్, సుబ్బరాయఫల్గుణ్ తదితరులు పాల్గొన్నారు.



కచేరి నిర్వహిస్తున్న చిట్టా కార్తీక్, గాయత్రి విభావరి

నవ్వులు పూయించిన హాస్య ప్రహసనాలు

విజయవాడ కల్చరల్: హాస్యవేదిక సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ మూడవ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన హాస్య ప్రహసాలు, హాస్య గీతాలు నవ్వులు పూయించాయి. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు దిట్టకవి రామకృష్ణ మాచార్యులు ఆధ్వర్యంలో ఉమా బలరాం, బాలాజీకుమార్, కామేశ్వరి,గెల్లి సువర్ణ, తెలుగు సినిమాల్లోని హాస్య గీతాలను పాడి వినిపించారు. గాయకులు బాలాజీకుమార్, సూర్యకామేశ్వరి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణ మూర్తి మాట్లాడుతూ హాస్యం సున్నితంగా ఉండాలని ఒకరిని అపహాస్యం చేసివిగా ఉండకూడదన్నారు. ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు మాడుగుల రామకృష్ణ తెలుగు సాహిత్యంలో హాస్య పాత్రలు అంశంగా ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన చలమచర్ల వేణుగోపాలాచార్యులు, పిడికిటి సత్యప్రసాద్ ఆరుమల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తెలుగు సినిమాలలోని హాస్య గీతాలను గానం చేస్తున్న గాయనీ గాయకులు

నాగేంద్ర సేవలు స్ఫూర్తిదాయకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వస్తున్న భక్తులకు చేస్తున్న నిత్యాన్నదానంలో దాత మరడ నాగేంద్ర అందిస్తున్న సేవలు నిరుపమానం అని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. తిరుమలకు కూరగాయలు పంపిస్తున్న దాత నాగేంద్రను సోమవారం ఆయన టీటీడీ బోర్డు సమావేశ మందిరంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మండవ కుటుంబరావు ఇటువంటి సేవలను అందించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో స్వామివారికి సేవ చేస్తున్న నాగేంద్ర మరింత శక్తితో సేవలందించాలని పేర్కొన్నారు. దాత నాగేంద్ర మాట్లాడుతూ 2006 లో దివంగత మండవ కుటుంబరావు కూరగాయలను తిరుమల నిత్యాన్నదాన పథకానికి పంపించడం ప్రారంభించారని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు 400 లారీల ద్వారా 4000 టన్నులకు పైగా కూరగాయల అందజేసినట్లు వెల్లడించారు. ఆయన అందించిన స్ఫూర్తితోనే తాను కూరగాయలు అందిస్తున్నానని చెప్పారు. ఇప్పటివరకు స్వామివారికి ప్రతి నెలా అందజేస్తున్న కూరగాయలను మరింత విస్తృత స్థాయిలో అందజేసేందుకు స్వామివారి అనుగ్రహం మేరకు కృషి చేస్తానని చెప్పారు.



మరడా నాగేంద్రను సత్కరిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

నేటి నుంచి సంగీత కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: ప్రసారభారతి, విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో జీ 20 కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో మంగళ, బుధవారాల్లో సంగీత సంధ్య కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు విజయవాడ ఆకాశవాణి కేంద్రం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు సాయంత్రం 6 గంటలకు తులసీ విశ్వనాథ్ గాత్ర కచేరీ, తొలుబొమ్మలాట లలిత సంగీత కార్యక్రమం, 30 వ తేదీ భక్తి సంగీతం, శాస్త్రీయ సంగీతం, గరగ నృత్య కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.